# పవిత్ర హృది

## కిరణ్ కుమార్

వంట పని పూర్తిచేసి ప్రక్క గదిలో కొచ్చిన పద్మావతికి హాల్లో నుంచి ప్రక్కింటి ఆండాళమ్మ మాటలు వినిపిస్తున్నాయి.

"నువ్వు అదృష్టవంతు రాలివే సుభద్రమ్మా. శ్రీదేవి భూదేవిలాంటి కోడళ్లు, నట్టింటి బంగారంలా మనమడు మనుమరాలు. — ఇల్లంతా చక్క దిద్దుతూ ఎంతో మంచితనంతో, శాంతంతో — నీ పెద్దకోడలు పద్మావతమ్మని చూస్తే నాకు చెప్పలేనంత ఆనందం అనిపిస్తుందే!" దీర్ఘాలు తీస్తూ అంటూంది ఆండాళమ్మ.

"నిజంగా పద్మావతమ్మ లాంటివాళ్ళు నూటికో కోటికో ఒకళ్ళుంటారు అనిదానం, ఔదార్యం, హుందాతనం, ఓపిక, విసుగనే మాటే లేకుండా ఎంత చాకిరీ అయినా చేస్తుంది. ఒక్క నిమిషమైనా వూర్కే వున్నట్టు కనుపించదు." ఎదురింటి రంగనాయికమ్మ మాటలవి.

"అట్లా చాకిరీ చేసేనమ్మా దానికిక పిల్లలు కలగకుండా అయింది."

సుభద్రమ్మకి తన పెద్దకోడలు మూడేళ్ళ క్రితం నీళ్ళ బిందెతో మెట్లవద్ద పడ్డప్పుడు డాక్టరు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చి బాధపడింది.

"ఆవిడకిక పిల్లలు కలగక పోతేనేం. చిన్నకోడ లుందిగా వంశాభివృద్ధి చేయటానికి" ఆండాళ్ళమ్మ తన ఉద్దేశ్యం వెలిబుచ్చింది.

"ఆ(....సరస్వతమ్మ పిల్లలు పద్మావతమ్మ పిల్లలవుతారా. పద్మావతి కడుపున పుడితే ఆవిడ గుణాల్లో కొన్నయినా వస్తాయి వాళ్ళకి." రంగనాయికమ్మ అంది

"సరస్వతి పిల్లలకి మాత్రమేం. రఘు మూడేళ్ళ వాడయినా ఎంతో తెలివిగా వుంటాడు. పద్మావతి ఇంటికి పెద్దకోడలు కాబట్టి ఆ మాటలుగానీ...." ఆండాళ్ళమ్మ కోడలు నళిని తన స్నేహితురాలు సరస్వతిని మెప్పించాలని అంది.

"పద్మావతికి పిల్లలంటే ఎలాగయినా అదొక యిది! ఆవిడ పిల్లలకి ఈవిడ పిల్లలికి సహస్రాంతకం తేడా వుంటుంది." సుభద్రమ్మ చిన్న కోడలు సరస్వతిని చూపిస్తూ, రంగనాయికమ్మ, నళిని అభిప్రాయాన్ని ఖండించింది.

"ఏం, నా బాబుకేం. వాడెందులోనూ ఎవరికీ తీసిపోడు. ఈ వంశోద్ధారకుడు వాడే. నా తోటి కోడలు కూతురు కంటే నా పిల్లలు అన్నివిధాల గొప్పవాళ్లే అవుతారు. బండెడు చాకిరీ చేసి మంచివాళ్ళని పించుకున్నంత మాత్రాన, తెలివైన పిల్లలు పుడతారా! లింగుమంటూ ఒక్క పిల్లని కన్న తల్లీ తల్లే!" రంగనాయికమ్మ మాటలికి సరస్వతికి తన స్వాతిశయం దెబ్బ తిన్నట్లనిపించి, తన ఎదుటే, తోటికోడలు పద్మావతి కంటె తనని తక్కువగా జమ కడితే, అంతరంగంలో పద్మావతి మీద గౌరవం వున్నా, భరించ లేకపోయింది సరస్వతి.

"నువ్వు మాత్రమేం పదిమందిపిల్లల్ని కన్నావా?" సరస్వతికి కోపం వచ్చిన సంగతి తెలిసికూడా అంది రంగనాయికమ్మ.

"పది మందిని కనకపోతే మాత్రమేం నేను మగబిడ్డ తల్లిని. నాకేం. అన్ని విధాలా మిగతావాళ్ళకంటె నే నధికమే" సరస్వతి స్వాతిశయం మరొక మెట్టెక్కింది.

"అయినా మా కెందు కొచ్చిందిలే అమ్మా. వస్తాం." ఆండాళ్ళమ్మతోబాటు మిగిలిన వారంతా వెళ్ళిపోయారు. సుభద్రమ్మ, సరస్వతి మాత్రం హాల్లో నిశ్శబ్దంలో కూర్చున్నారు.

గదిలో నుంచుని ఆ మాటలన్ని విన్న పద్మావతి ముఖం వివర్ణమయింది. పద్మావతి మనసులో ఆమె ఎన్నడూ ఎరుగని అసహ్యం, కోపం, అసూయ చెలరేగాయి సరస్వతి మీద—సరస్వతికి నాపై ఇంత ద్వేషం, అక్కసు వున్నా యన్నమాట! మగపిల్లవాడి తల్లినని ఎంత గర్వం! నా ఎదుట; నాపై ఆదరణ నటిస్తూ మనసులో వేరే విధంగా ఆలోచించటం సరస్వతి స్వభావమా! నాలుగేళ్ళ నుంచీ నేనా విషయం గ్రహించనే లేకపోయానే. - తను ఎదురుగా వుండి, సరస్వతి అట్లా మాట్లాడుతూంటే చూస్తూ ఎలా కూర్చో గలిగింది అత్తయ్య. అత్తయ్య ఆ మాటలు వింటూ మవునంగా కూర్చున్నదంటే ఆమెకు కూడా నాపై అదే అభిప్రాయం వుందా?- నా శక్తంతా ధారపోసి పగలనక రాత్రనక శ్రమిస్తూ, అత్త మామలకీ, మరిదికీ, తోటి కోడలుకీ. ఇంటిల్లపాదికీ నేను చాకిరి చేస్తూంటే దానికి ప్రతిఫలమా యిది?— తను మగ పిల్లవాడ్ని కంటే మాత్రం నన్ను గురించి అంత అవహేళనగా ఎందుకు మాట్లాడటం. తను పనిమనిషితో సమంగా సరస్వతి నన్ను భావిస్తుందన్న మాట!—అయినా తప్పంతా నాదీ ఆయనదీను. రాత్రింబవళ్లూ పొలం పట్టుక్కూ-

ర్చొని వెట్టి చాకిరీ చేస్తూ కుప్పలుగా పండి స్తారు ఆయన. ఎవరికోసం ? వీళ్లందరి కోసం కాదూ! తమ్ముడు పంచాయితీ ప్రెసిడెంటని మురిసిపోతూ వుంటారు ఆయనకేం ఒరిగిందో అందువల్ల! ముఖ్యంగా నాది' పద్మావతి యింక ఆలో చించలేక తల భారంగా అనిపించి చాప మీద మేను వాల్చింది

*　　　*　　　*

శివరామయ్య పెదపాక గ్రామంలో మోతుబరీ రైతు అతనికి ఇద్దరు సంతానం పెద్దవాడు వెంకట్రామయ్య, రెండో వాడు రాజారావు. సుభద్రమ్మ అతని భార్య.

వెంకట్రామయ్య భార్య పద్మావతి వారికి ఒక్కగా నొక్క కూతురు రమ. రమ వయస్సు ఆయిదేళ్లు. రమ పుట్టిన తరువాత రెండేళ్ళకు పద్మావతి తిరిగి గర్భ వతయింది. కానీ ఇంట్లోకి నీళ్ళు తెస్తూ, దొడ్డి గుమ్మం పద్దున్న మెట్ల దగ్గర కాలు జారి బిందెతోపాటుగా క్రింద పడటం మూలాన ఆమె గర్భకోశానికి దెబ్బ తగి లింది ఆపరేషన్ చేసి చనిపోయిన శిశువును బయటకు తీశారు. ఆ కారణాన యిహ పిల్లలు కలిగే అవకాశం లేకుండా పోయింది పద్మావతికి.

రాజారావు భార్య సరస్వతి. రాజారావు బి. ఎ; దాకా చదివాడు. చదువుకున్న పిల్ల కావాలని సరస్వతిని పెళ్ళి చేసుకున్నాడు. రఘు వాళ్ళ బిడ్డ. వాడికి మూడేళ్ళుం టాయి.

వెంకట్రామయ్య వ్యయసాయం తనే స్వయంగా చూసుకుంటాడు రాజారావుకు పొలం పనులు రాక, యిష్టం లేక, రాజకీయాల్లో దిగి గ్రామ పంచాయతీ ప్రెసిడెంటయ్యాడు. వారి కుటుంబం అంటే గ్రామంలోని వారందరికీ చాలా గౌరవం

*　　　*　　　*

"అమ్మా. అమ్మా" దొడ్లోంచి రమ కేకలు వినిపించి, ఏమయిందోనని వంట చేస్తున్న పద్మావతి వంట గదిలోంచి దొడ్లోకి వెళ్ళింది.

రమ భావిలోకి చెయి చూపిస్తూ అమ్మా అడుతూ ఆడుతూ, తమ్ముడు నూతిలో పడ్డాడే" ఏడుస్తూ చెప్పింది. పద్మావతి కంగారు పడింది. త్వరత్వరగా భావి దగ్గరున్న బొక్కెన భావిలోకి వేసింది. భావిలో నుండి రఘు అరుస్తున్నాడు.— పద్మావతి మనసులో మధ్యాహ్నం సరస్వతి అన్న మాటలు వినిపించాయి. 'వీడిని చూసుకునేగా సరస్వతికి అంత అహం. ఆ గర్వంతోనేగా నన్నలా అంది! నా మీద అంత అలుసు, ద్వేషం వున్నదాని కొడుకును నేనెందుకు రక్షించాలి ? .... నాకేం పట్టింది. మంచితనానికి ఈ లోకంలో విలువేముంది గనక! వీడే లేకపోతే, సరస్వతికా గర్వం వుండదుగా!'—

రమ పిలిచిన పిలువు విని ముందు సావడిలో కూర్చునున్న వెంకట్రామయ్యా మిగిలినివారంతా దొడ్లోకి వచ్చారు. పద్మా

వతి, చేతిలోని బొక్కెన నీటిలోకి వేసింది.

"ఏమయింది పద్మా? ఏమయింది? నూతిలోకి దిగడానికి సిద్ధమవుతూ అన్నాడు వెంకట్రామయ్య.

"ఆడుకుంటూ ఆడుకుంటూ రఘు కాలు జారి నూతిలో పడ్డాడట రమ పెట్టిన అరుపుకు విని నేనొచ్చాను" బొక్కెనను యింకా భావిలోనే వుంచి అంది పద్మావతి.

"ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకుంటారా, భావిచుట్టూ ఎత్తుగావరలు కట్టించండీ అంటే." వెనకనుంచి సుభద్రమ్మ అంటూంది.

"అంత యిల్లుంటే ఈ గాడిదలు నూతి దగ్గరే ఎందుకు ఆడాలి?" శివరామయ్యకు కోపం వచ్చినట్టుంది.

సరస్వతి అయోమయంగా భావిలోకి చూస్తూ నుంచునుంది మనసులోని ఆవేదనంతా ఆమె ముఖంలో కనుపిస్తూంది,

రమ పాలిపోయిన ముఖంతో నుంచునుంది, తప్పు చేసినదానిలాగా. వెంకట్రామయ్య రఘుని భుజాన వేసుకుని భావిలోంచి పైకి తీసుకొచ్చాడు. సరస్వతి వుబికి వస్తున్న రోదనను ఆపులేక పోయింది. "బాబూ" అంటూ ఏడ్చేసింది.

"అరుగు మీద పడుకోబెట్టి కడుపు నొక్కి ముందుగా వాడు మింగిన నీళ్ళను పైకు తీయండి. ఒరేయ్ రామయ్యా. నువెళ్ళి డాక్టరుగార్ని త్వరగా పిలుచుకుని రా." ఆతురతపడుతున్నాడు శివరామయ్య.

డాక్టరు వచ్చాడు కళ్ళు తేలవేసి వున్న రఘుని పరీక్షించి "ఆలస్యమయిపోయింది వెంకట్రామయ్యగారూ. ప్రయోజనం లేదు. చనిపోయాడు." అని చెప్పి వెళ్ళిపోయాడు.

సరస్వతి గుండెల్లో కోటి కుంపట్లు మండుతున్నాయి. కళ్ళు నీటి ధారలు కారుస్తూ వుంటే ఆమె నోటి నుండి సముద్రపు ఘోష వినుపిస్తూంది. సుభద్రమ్మ పరిస్థితి అలానే వుంది. ఒక్క సుభద్రమ్మే ఏమిటి, అక్కడున్న ప్రతి ఒక్కరి పరిస్థితీ అట్లాగే వుంది. ప్రతికళ్లూ చెమర్చినాయి.

మృతదేహాన్ని తీసుకుపోతూంటే సరస్వతినీ, కట్టలు త్రెంచుకొస్తున్న ఆమె శోకాన్నీ ఆపటం ఎవరికీ సాధ్యం కాలేదు. కానీ విధిని ఎవరూ ధిక్కరించ లేరుగదా!

వారం రోజులు గడిచాయి ఎప్పుడూ సరస్వతి నవ్వులతోను, పిల్లల అల్లరితోను పద్మావతి పురమాయింపులతోనూ కళ కళలాడే ఆ యిల్లు, పాడుబడ్డ కొంపలా కళావిహీనమయింది. శోకమూర్తి ఆ యింట్లో తిష్టవేసి కూర్చున్నాడు.

పరామర్శించటానికని గ్రామ వాసులింకా వచ్చి వెళుతూనే వున్నారు. క్రొత్త వారిని చూస్తే చాలు సరస్వతికి తెరలు తెరలుగా వసూంది ఏడుపు.

"చదువుకున్న దానివి అన్నీ తెలిసిన దానివి. నువ్విలా ఏమీ తినకుండా విచా

రిస్తూ కూర్చుంటే ఎలా చెప్పు" ఎదురింటి రంగనాయకమ్మ సరస్వతి చేత రెండు మెతుకులు కతికిద్దామని అంది.

"నేను చాలా దురదృష్టవంతురాల్ని రంగనాయకమ్మగారూ. రఘుని చూసుకుని మురిసిపోయేదాన్ని, గర్వపడేదాన్ని. భగవంతుడికి కోపం వచ్చింది. అందుకే యిలా చేశాడు. నాకు అన్యాయంచేశాడు. సరస్వతి తనని తనే నిందించుకో సాగింది.

. . .

'ఏడవకమ్మా. ఏం చేస్తాం. వాడికి మనకి ఋణం తీరిపోయింది. చాలా తెలివయిన వాడు. బోద్దుగా 'నానమ్మా' అంటూ యిల్లంతా తిరుగుతూండేవాడు ఆ భగవంతుడు ఓర్వలేకపోయాడు" సుభద్రమ్మ కోడల్ని ఓదార్చ ప్రయత్నించింది.

గత నాలుగు రోజులనుంచి రమ ఆరోగ్యం బాగాలేదు. జ్వరం వస్తూంది. డాక్టరు వచ్చి చూసి ' టెంగ మీద వచ్చివ జ్వరం" అని చెప్పి ఏవో మందు లిచ్చి వెళ్ళాడు కూతురికి వచ్చింది మామాలు జ్వరమైనా ఎందువల్లనో చెప్పలేనంత ఆవే



దనగా వుంది పద్మావతికి. రమ రఘుకోసం బెంగపడ్డదంటే,..బెంగతో వచ్చిన జ్వరం యిన్ని రోజు లుంటుందా! రమకు జ్వరం హెచ్చుపోతే! ఏదైనా కాకూడనిదయితే! బాబోయ్' తను బ్రతకగలదా!!!—

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్? తమ్ముడి కోసమా?" ప్రక్కనే కూర్చుని జుట్టును సర్దుతూన్న పద్మావతి అడిగింది రమ.

"అబ్బె. ఏం లేదమ్మా. నీకు జ్వరం వచ్చిందని."



"తగ్గిపోతుందిగా."

"తగ్గుతుంది తల్లీ. తప్పకుండా తగ్గుతుంది. పడుకో. నిద్దరపో." రమ తల నిమిరి, ముద్దు పెట్టుకుంటూ అంది పద్మావతి.

రమను నిద్రబుచ్చి తనూ వెళ్ళి పడుకుంది పద్మావతి. కాని నిదుర రావడం లేదు. పగలంతా చాకిరీచేసి శరీరం అలసిపోయింది. విశ్రాంతిని కోరుతూంది. మనసు మాత్రం విశ్రాంతి తీసుకుంటానికి నిరాకరిస్తూంది. రమకు యిదివరలోనూ చాలా సార్లు జ్వరం వచ్చిందీ, తగ్గిపోయింది కూడాను. తను యింత బాధ పడలేదెప్పుడూ. ఇప్పుడు మాత్రం రమకి జ్వరం అన్నమాటే భయంకరంగా అనిపిస్తూంది. దానికి కారణం తనలో తనే ఆలోచించుకో సాగింది పద్మావతి—నే నేమయినా తప్పుచేశానా? రఘు నాప్రయత్న లోపంవల్ల మరణించాడా? ఒక వేళ నా ప్రయత్నలోపంవల్ల మరణించినా? తప్పు లేదు. వాడ్ని చూసుకుని సరస్వతి నన్ను గురించి నలుగుర్లో ఎంత అగౌరవంగా నోటి కొచ్చినట్లు మాట్లాడింది. అంత గర్వం ప్రబలినప్పుడు తగిన శాస్తి జరగాల్సిందే. రఘుని రక్షించడంలో నా ప్రయత్నంలో లోపం వున్నా బాధ పడవలసిన పనిలేదు. నేను చేసిన పని మంచిదే. సరస్వతికి యిప్పుడుగానీ తెలిసి రాదు, తాను మగబిడ్డ తల్లినని విఱ్ఱవీగినందుకు ఫలితం....ఏమిటి నా మనసు ఇంత కఠినంగా ఆలోచిస్తూంది? తప్పు చేసింది సరస్వతయి నప్పుడు. రఘూ ఎందుకు చావాలనుకున్నాను? నాలో రాక్షసత్వం ఏర్పడిందా? పసివాడు వాడు నాకేం అపకారం చేయలేదే. అభం శుభం ఎరుగని వాడ్ని నేనెందుకు బలిగొన్నాను. సరస్వతి ఏదో అన్నంత మాత్రాన నాలో అంత పశుత్వం ఎందుకు ప్రబలింది. స్వార్థం వున్నప్పుడు సరస్వతికి మాత్రం స్వార్థం వుండకూడదా? అందులో ఆమె తప్పేముంది. అమె బైటకు అన్నది. నేను లోన అనుకుంటున్నాను. అదే బేధం. ఆమెపై నా కెందుకు ప్రతీకార వాంఛ. అటువంటి వాంఛే వుంటే సరస్వతిపై తీర్చుకోవాల్సింది. అంతేగాని పాపిష్టిదాన్ని ఎంత అన్యాయం చేశాను. నిండు ప్రాణిన్ని చేతులారా చంపానే! నా పిల్లకా వుసురు తగిలితే! రమకు జ్వరం హెచ్చిపోయి.... 'అమ్మో' కాకూడదు, అలా ఎన్నటికీ కాకూడదు. తప్పుచేసింది నేను. రఘుని చంపింది నేను. నా రమకేం అపాయం జరక్కూడదు - జరగకూడదు'

పద్మావతి బిగ్గరగా అరచిన అరపులకి వెంకట్రామయ్యతోబాటు అందరూ ఆమె పడుకునున్న మంచం దగ్గర కొచ్చారు.

"రఘూ చనిపోవటానికి కారణం నేను నేను" పద్మావతి బిగ్గరగా అరుస్తూ లేచి కూర్చుంది.

"పద్మా. పద్మా ఏమిటి? ఏమిటలా అరుస్తున్నావు?" పద్మావతిని తన చేతుల్తో

నిద్ర లేపుతూ అడిగాడు వెంకట్రామయ్య.

"ఈఇంటి కేదో అనర్థం పట్టిందమ్మా. లేకుం టేఎప్పుడూలేంది ఏమిటిదంతా?" పద్మావతి పెడ తున్న పిచ్చి కేకలు విని వాపోయింది సుభద్రమ్మ.

"ఏమండీ. రఘు భావిలో పడ్డప్పుడు బొక్కెన నూతిలో వేయిటంలో నేనే కొంచెంగా ఉపేక్షించానండీ. అందుకనే నా చిట్టితండ్రి వాడు చనిపోయాడు. నేను బ్రతికించ లేకపోయాను. సరస్వతీ... పది మందిలో నన్ను దూషించిందన్న కోపంతో రఘుని బైటకు తీయటంలో ఉపేక్షించాను. నేను శ్రద్ధగా ప్రయత్నిస్తే బ్రతికే వాడేనండీ" పద్మావతి ఏడుస్తూ చేతుల్తో ముఖాన్ని కప్పుకుంది.

"ఛ. ఏమిటా వెర్రి మాటలు. నువ్వు రఘుని రక్షించకుండా ఉపేక్షించటమేమిటి? మే మందరం రానే వచ్చాంగా. ఆ ఘడి యొస్తే ఎంతటివాళ్ళయినా పోవాల్సిందే. వృథాగా నువ్వు వ్యధపడి మమ్మల్ని బాధ పెట్టకు—" వెంకట్రామయ్య మందలిస్తు న్నట్లన్నాడు.

"అమ్మా సరస్వతీ" పద్మావతి వెర్రిగా అరిచింది. ఎదురుగా నుంచునున్న సర స్వతి పేలవంగా నవ్వింది. సరస్వతి నవ్విన ఆ నవ్వుని చూసి పద్మావతి విరగ బడి నవ్వసాగింది. ఆమె నవ్వుని ఆపటం ఎవ్వరికీ సాధ్యం కాలేదు.

